సాక్షి
ఖమ్మం
ఆదివారం । 5 । జనవరి । 2025



మున్సిపాలిటీలపై భారం

మెప్మా ఆర్పీలకు మున్సిపాలిటీల నుంచి రీయింబర్స్‌మెంట్ విధానంలో వేతనాలు చెల్లించాలని ఆదేశాలు అందాయి. 8లో



భద్రతపై కార్యాచరణ

ప్రమాదాలను అరికట్టేలా రహదారుల భద్రతకు కార్యాచరణ అమలుచేస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 16°

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



ఆలయ ఆవరణలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం జరిపించగా తెలంగాణ, ఏపీకి చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే, భక్తుల సమక్షాన శ్రీవారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మహిళా మార్ట్



డ్వాక్రా భవనానికి వేయించిన పెయింటింగ్

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా సంఘాల సభ్యులు రూపొందించిన ఉత్పత్తుల విక్రయానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చొరవతో ఖమ్మంలోని వైరా రోడ్డులో ఉన్న టీటీడీసీ భవనం పక్కన డ్వాక్రా భవనంలో ఈ మార్ట్ ఏర్పాటుకానుంది. ఇప్పటికే డ్వాక్రా బజార్‌ను ఆధునీకరించడమే కాక పల్లెటూరి వాతావరణం ఉట్టిపడేలా పెయింటింగ్ వేయించారు. మరో వారం రోజుల్లో మార్ట్‌ను ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులు రూపొందించిన ఉత్పత్తులను 'మేడిన్ ఖమ్మం' బ్రాండ్‌తో ఇక్కడ విక్రయించనున్నారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కె.సత్యనారాయణ తెలిపారు. గ్రూప్–1 ప్రిలిమ్స్, గ్రూప్–2, 3, 4తో పాటు కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకు పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. నాలుగు నెలల పాటు కొనసాగే శిక్షణకు డిగ్రీ పూర్తి చేసుకున్న మైనార్టీ అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, డిగ్రీ మెమో, రెండు ఫొటోలు జతచేసి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 10లోగా సమర్పించాలని, వివరాలకు 97040 03002 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

రఘునాథపాలెం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి పరీక్ష నోటిఫికేషన్ విడుదలైందని రఘునాథపాలెం గిరిజన గురుకుల ప్రతిభా కాలేజీ, పాఠశాల ప్రిన్సిపాల్ మల్లెల బాలస్వామి తెలిపారు. ఇందులో భాగంగా నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మీ సేవ లేదా ఇంటర్నెట్ కేంద్రాల్లో ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, పాస్ ఫొటో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఫోన్ నంబర్‌తో పాటు రూ.వంద ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు గడువు ఉండగా, అదేనెల 23న పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అలాగే, గురుకులాల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సంబంధిత వెబ్‌సైట్లలో పరిశీలించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

డయల్ 100కు 4,134 ఫోన్లు



ఖమ్మంక్రైం: ఆపదలో ఉన్న వారిని సత్వరమే ఆదుకునేలా ఏర్పాటుచేసిన డయల్ 100కు డిసెంబర్ నెలలో 4,134 మంది ఫోన్ చేశారని సీపీ సునీల్ దత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 107 ఘటనలకు సంబంధించి ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని వెల్లడించారు. వీటిలో ప్రమాదాలు 24, అనుమానాస్పద మరణాలు ఐదు, చోరీలు 14 సహా మరికొన్ని కేసులు ఉన్నాయని తెలిపారు.

యూత్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రతాప్‌రెడ్డి



యువతీయువకుల బృందనృత్య ప్రదర్శన



డోలుతో నృత్యం చేస్తున్న యువతులు





అమ్మవారి వేషధారణలో యువతి నృత్యప్రదర్శన

ఉత్సాహంగా.. ఉల్లాసంగా!

- నృత్యాలతో హోరెత్తించిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు
- ఉమ్మడి జిల్లాస్థాయి యూత్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన కేయూ వీసీ

ఖమ్మం రాపర్తినగర్: పాశ్చాత్య గేయాలకే కాదు భరతనాట్యం, జానపద పాటలకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చేసిన నృత్యాలతో ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల(కేఎండీసీ) శనివారం హోరెత్తింది. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి యూత్ ఫెస్టివల్‌ను కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చదువుకుంటూ సమాజంపై బాధ్యతగా సాంఘిక దురాచారాల నిర్మూలనకు పాటుపడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వివిధ రూపాల్లో చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కె.మల్లారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి వై.వెంకయ్య, కేఎండీసీ చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, యూత్ ఫెస్టివల్‌లో విజేతలకు కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ బహుమతులు అందజేశారు.

బోదులబండలో వరినాట్లు వేస్తున్న పశ్చిమబెంగాల్ కూలీలు



వరినాట్లకు వలస కూలీలు..!



- పశ్చిమబెంగాల్, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి రాక
- ఉమ్మడి జిల్లాకు ఎక్కువగా బెంగాల్ కూలీలు
- రెండు వ్యవసాయ సీజన్లలో నెల పాటు మకాం
- కూలీ గిట్టుబాటు అవుతుండడంతో పెరుగుతున్న రాకపోకలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ వరినాట్లకు వలస కూలీలు బాట పట్టారు. పశ్చిమ బెంగాల్, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీలు ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో నెల పాటు ఇక్కడే మకాం వేస్తారు. ఆయా రాష్ట్రాల్లో పనులు సరిగ్గా దొరకకపోవడం, పని దొరికినా కూలి తక్కువగా ఉండడం.. మన రాష్ట్రంలో కూలి ఎక్కువగా దక్కుతుండడంతో ఉపాధి నిమిత్తం వస్తున్నారు. మరోపక్క నాట్లు త్వరగా పూర్తవుతుండడం, ఈ ప్రాంతంలో కూలీలకు ఇచ్చే నగదుతో పోలిస్తే తక్కువ తీసుకుంటుండడంతో రైతులు వలస కూలీల వైపు మొగ్గు చూపుతున్నారు.

స్థానికంగా కూలీల కొరత

సాగునీటి వనరులు పెరగడమేకాక భారీ వర్షాలతో జలవనరులు కళకళలాడుతున్నాయి. దీంతో చిన్న కమతాలు ఉండి నీటి వనరులు లేని వ్యవసాయ కుటుంబాలు ఇప్పుడు సాగు చేసుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టుకు తోడు ఉమ్మడి జిల్లాలో ఇతర జల వనరుల ఆధారంగా సాగు ఏటేటా పెరుగుతోంది. ఫలితంగా స్థానికంగా కూలీల లభ్యత తగ్గడం, యంత్రాలు అందుబాటులోకి వచ్చినా అన్ని పనులు చేయలేని పరిస్థితి ఎదురవుతుండడంతో రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వరి నాట్లకు వినియోగంలోకి తీసుకొచ్చిన యంత్రాలు మెరుగైన ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో రైతులు కూలీలపైనే ఆధారపడుతుండగా.. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వలస కూలీలు వారికి ఆసరా అవుతున్నారు.

కూలి తక్కువ.. పని త్వరగా..

రోజువారీగా తీసుకునే కూలి తక్కువగా ఉండడమే కాక పని చకచకా పూర్తవుతుండడంతో రైతులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలతో వరి నాట్లు వేయిస్తున్నారు. మొత్తం 40 మంది ముఠాగా ఏర్పడి రోజుకు ఐదెకరాల్లో నాట్లు వేస్తున్నారు. ఎకరాకు రూ.4,500 చొప్పున తీసుకోవడంతో పాటు నారు కట్టలను కూడా వీరే మోస్తుండడంతో పని సులువవుతోంది. పశ్చిమబెంగాల్, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో కూలీలు ఇక్కడకు వచ్చి నెల పాటు రైతుల క్షేత్రాల వద్దే బస చేస్తున్నారు. వరి నాట్లే కాకుండా మిర్చి ఏరడం, ఇతర వ్యవసాయ పనులు కూడా చేస్తుండడంతో ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో వీరికి మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ నాట్లు పూర్తయ్యాక ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాలకు వెళ్తామని వలస కూలీలు చెబుతున్నారు.

ప్రత్యేకంగా నాట్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఎక్కువగా పశ్చిమబెంగాల్ నుంచి కూలీలు వస్తున్నారు. వీరు క్రమపద్ధతిలో నాట్లు వేస్తుండగా, పాయలు తీసే ఖర్చు తగ్గుతోంది. ప్రతీ వరుసకు స్థలం వదులుతుండడంతో పంటకు వెలుతురు, గాలి సమృద్ధిగా అందుతుందని, తద్వారా పురుగు సోకడం లేదని రైతులు చెబుతున్నారు. తద్వారా పురుగుల మందుల భారం తగ్గుతోందని తెలుస్తోంది. పశ్చిమబెంగాల్ కూలీలు ఉమ్మడి ఖమ్మంలోనే కాక నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోనూ వరినాట్లు వేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం 40మందితో కూడిన బృందం సాగర్ ఆయకట్టులోని నేలకొండపల్లి తదితర మండలాల్లో వరినాట్లు వేస్తున్నారు.

ఏటా ఇక్కడికి వస్తాం..



ఏపీ, తెలంగాణల్లో సీజన్లవారీగా వరినాట్ల కోసం వస్తుంటాం. సీజన్ అయ్యే వరకు ఇక్కడే ఉండి పనులు పూర్తయ్యాకే మా రాష్ట్రానికి తిరిగి వెళ్తాం. మాకు ఈ రెండు రాష్ట్రాల్లో ఉపాధి సమృద్ధిగా దొరుకుతోంది. మేము ఒక్కో ముఠాగా ఏర్పడి రోజుకు ఐదు నుంచి ఆరెకరాలకు పైగానే నాట్లు వేస్తాం.
– శ్యామ్, అమిథిల్, ఘోష్‌బా జిల్లా, పశ్చిమ బెంగాల్

రైతులు ఆదరిస్తున్నారు..



మా రాష్ట్రం నుంచి 40 మందిమి వచ్చాం. నాటు వేసినందుకు ఎకరాకు రూ.4,500 తీసుకుంటాం. ఇక్కడి రైతులు మా పని మెచ్చుకుంటున్నారు. మేము నాటు వేస్తే పంట ఎక్కువగా వస్తోందని ఆదరిస్తున్నారు. గతంలోనూ పలుమార్లు వచ్చాం. మాకు ఉపాధి కల్పిస్తున్న రైతులకు రుణపడి ఉంటాం.
– హరేకృష్ణ, అమిథిల్, ఘోష్‌బా జిల్లా, పశ్చిమ బెంగాల్

కూలీల కొరతతోనే...



ఇక్కడ కూలీల కొరత ఉంది. అత్యవసర సమయాల్లో ఎవరూ దొరకడం లేదు. దీంతో పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన కూలీలతో వరి నాట్లు వేయిస్తున్నాం. వీరు నాటు వేసే పద్ధతితో అనేక ప్రయోజనాలు ఉంటున్నాయి. ఓవక్క కూలీల కొరత తీరడమే కాక పని త్వరగా పూర్తవుతోంది.
– మరికంటి నాగేశ్వరరావు, భైరవునిపల్లి, నేలకొండపల్లి మండలం

త్వరలోనే అన్నదాతలకు శుభవార్త

- ఇప్పటికే రుణమాఫీ చేశాం, 'భరోసా' కూడా ఇస్తాం...
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



గన్యాతండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి

కూసుమంచి: రాష్ట్రంలోని ఇందిరమ్మ ప్రభుత్వం రైతన్నలకు ఏ లోటు రాకుండా అండగా నిలుస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి మాట్లాడుతూ రైతులకు ఇప్పటికే రూ.వేల కోట్ల రుణమాఫీ చేసిన తమ ప్రభుత్వం త్వరలోనే రైతు భరోసా అందించనుందని తెలిపారు. త్వరలోనే రైతులకు తీపి కబురు చెబుతామని వెల్లడించారు. ఈక్రమాన రైతులు భరోసాపై అపోహలకు గురికావొద్దని సూచించారు. అలాగే, ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ సంక్రాంతి తర్వాత మొదలవుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని పొంగులేటి వెల్లడించారు. కాగా, గ్రామాల అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి సారించామన్నారు. ఈకార్యక్రమాల్లో ఆర్డీఓ నర్సింహారావు, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ ఎస్‌ఈలు హేమలత, వెంకటేశ్వర్లు, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



టీ తాగుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన ఎంపీ తదితరులు

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం

ఖమ్మంరూరల్: రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతోనే ఇందిరా మహిళాశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డులోని తరుణీ హాట్‌లో ఏర్పాటుచేసిన ఇందిరా టీస్టాల్‌ను ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం టీ తాగిన మంత్రి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఆర్‌డీఓ నర్సింహారావు, అదనపు డీఆర్‌డీఓ నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జిల్లా జడ్జి ఉమాదేవి

ఖమ్మంలీగల్: బాలల హక్కుల పరిరక్షణను సమాజంలోని అందరూ బాధ్యతగా భావించాలని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఉమాదేవి సూచించారు. ఖమ్మంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగే అవగాహన సదస్సు శనివారం ప్రారంభం కాగా ఆమె మాట్లాడారు. బాలలు సమాజానికి అమూల్య సంపద అని తెలిపారు. ఈనేపథ్యాన వారికి హక్కులపై అవగాహన కల్పించేలా అన్ని వ్యవస్థలు పనిచేయాలని చెప్పారు. బాలల ఉత్తమ ప్రయోజనాల పరిరక్షణ, రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరావు మాట్లాడుతూ బాలల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం బాలల సంరక్షణాధికారి విష్ణువందన, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హన్మంతరావుతో పాటు లలిత, వలరాజు, శ్రీనివాసగుప్తా మాట్లాడగా ప్యానెల్ న్యాయవాదులు ఇమ్మడి లక్ష్మీనారాయణ, శ్రీలక్ష్మి, రామలక్ష్మి, లలిత, అమర్‌నాథ్, కల్యాణి, వాసవి పాల్గొన్నారు.

గోదారి తీరంలో క్యాంప్ సైట్!

భద్రాద్రిలో భక్తుల పర్ణశాలకు ఏర్పాట్లు

- పనులు పూర్తయితే పట్టణానికి సరికొత్త సొబగులు
- శిబిరాల్లో సోలార్ కాంతుల వెలుగు జిలుగులు
- భక్తులకు అందుబాటులో గిరిజన రుచులు



గోదావరి తీరం వెంట ఏర్పాటు చేస్తున్న విడిది కుటీరాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రామాయణ గాథలో వనవాసం చేసేందుకు సీతారాములు అయోధ్యను వదిలి దండకారణ్యం చేరతారు. గోదావరి తీరాన వెదురుతో చేసిన కుటీరంలో జీవనం సాగిస్తూ అడవుల్లో దొరికే ఫలాలు, కంద మూలాలనే ఆహారంగా స్వీకరిస్తారు. సీతారాముల వనవాస ఘట్టంలో పర్ణశాల విశేషాలు మనోహరంగా ఉంటాయి. ఆస్థాయిలో భక్తులు గోదావరి తీరంలో విడిది చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సరికొత్త అనుభూతి ఇచ్చేలా..

శీతాకాలం వచ్చిందంటే చాలు మంచు దుప్పటిలో సేద తీరేందుకు, ప్రకృతితో ముచ్చటించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపిస్తారు. పొరుగునే ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగి, వంజంగి, తానంగి, అరకు, మారేడుమిల్లి ప్రాంతాలకు వెళ్తుంటారు. అక్కడి పంట పొలాల్లో, గుట్టలపై ఏర్పాటు చేసిన క్యాంపుల్లో విడిది చేస్తుంటారు. అలా వెళ్తున్న వారికి ఇక్కడా అలాంటి ఏర్పాట్లు ఉంటే బాగుండేది కదా అనిపిస్తుంటుంది. మరోవైపు ముక్కోటి, శ్రీరామనవమి, హనుమాన్ మాలధారణ సమయాల్లో భద్రాచలానికి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. వీరికోసం ప్రైవేట్ లాడ్జీలు, హోటళ్లు, దేవస్థానం సత్రాలు, పలు ప్రైవేటు సత్రాలు ఉన్నా.. వసతి దొరకక ఇబ్బంది పడుతుంటారు. దీంతో స్థానికంగా ఉన్న హోం స్టేలతో పాటు సమీపంలోని పాల్వంచ, కొత్తగూడెంల్లో వసతి సౌకర్యం చూసుకుని భద్రాచలం వచ్చి వెళ్తుంటారు. కానీ ఇప్పుడు అటు భక్తులు, ఇటు పర్యాటకులకు సరికొత్త అనుభూతి కలిగించేలా గోదావరి తీరంలో క్యాంపింగ్ సైట్ ఏర్పాటు చేస్తున్నారు.

కరకట్ట వెంట నిర్మాణం..

భద్రాచలంలో గోదావరి కరకట్ట వెంట ఆధునిక సౌకర్యాలతో కూడిన క్యాంప్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. ఈ క్యాంపుల చుట్టూ స్థానిక సంస్కృతి ఉట్టిపడేలా వెదురుకర్రలతో ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తున్నారు. రాత్రివేళ వెలుగు కోసం సోలార్ లైటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. వెదురు పందిరి కింద కామన్ కిచెన్ ఏర్పాటుచేసి స్థానిక మహిళలతో గిరిజన వంటకాలు తయారు చేయించి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ క్యాంప్ సైట్ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చకచకా పనులు చేపడుతున్నారు. దీంతో భక్తులు, పర్యాటకులకు ఆధ్యాత్మిక అనుభూతి కలగడంతో పాటు స్థానిక సంస్కృతి, ఆహారపు అలవాట్లను పరిచయం చేసే అవకాశం కలుగుతుంది. ఈ క్యాంప్‌సైట్‌కు యువత నుంచి ఆదరణ లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈమేరకు ఆదరణను బట్టి నవమి వరకు వీటిని కొనసాగించాలని నిర్ణయించారు. ఆ తర్వాత శాశ్వత ప్రాతిపదికన మరింత మెరుగైన సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు.



వెదురు కర్రలతో నిర్మిస్తున్న ఫుడ్ స్టాల్



పర్యాటకుల కోసం ఏర్పాటుచేస్తున్న టెంట్లు

ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి

భద్రాచలంటౌన్: భద్రాచలంలో రివర్ ఫెస్టివల్ నిర్వహణ ఏర్పాట్లు ముగింపు దశకు చేరాయని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. గోదావరి కరకట్ట ప్రాంతంలో నిర్మిస్తున్న తాత్కాలిక విడిది గృహాలు, గిరిజన కళాఖండాల స్టాళ్లు, బోటింగ్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఈ ప్రాంతమంతా విద్యుత్ కాంతులు వెదజల్లేలా సోలార్ లైట్లు ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపారు. గోదావరి అందాల మధ్య ఫొటోలు తీసుకునేలా సెల్ఫీ పాయింట్ నిర్మించామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు పట్టణమంతా వినిపించేలా సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆలయ ఈఈ రవీందర్‌ను ఆదేశించారు. అనంతరం గోదావరిలో బోటులో విహరించి పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏఈ వెంకటేశ్వరరావు, గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: కార్మికుల పిల్లలు, కార్మికులు ఉపకార వేతనాల కోసం ఫిబ్రవరి 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటార్ రవాణా సంస్థలు, సహకార సంస్థలు, ఇతర ట్రస్ట్‌ల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలు, కార్మికులకు ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు మంజూరు చేస్తారని వెల్లడించారు. 2023–24లో ఎస్సెస్సీ, ఐటీఐ ఉత్తీర్ణులైన వారికి రూ.వెయ్యి, పాలిటెక్నిక్ కోర్సుకు రూ.1,500, ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ, బీసీఏ, ఎంసీఏ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ తదితరులు కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి రూ.2వేల చొప్పున ఉపకార వేతనం అందుతుందని తెలిపారు.

ఈనెల 11 నుంచి టీసీసీ పరీక్షలు

ఖమ్మంసహకారనగర్: డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్(టీసీసీ) కేటగిరీల్లో అభ్యర్థులకు ఈనెల 11 నుంచి 17వ రకు పరీక్షలు జరుగుతాయని డీఈఓ సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పరీక్షకు కొద్దిరోజుల ముందు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్‌టికెట్లు, ఇతర వివరాల కోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

అభ్యుదయ రైతులకు పురస్కారాలు



సన్మానం అందుకుంటున్న రాంరెడ్డి దంపతులు, రామారావు దంపతులు

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మం రూరల్: సంక్రాంతి సంబురాల్లో భాగంగా రైతునేస్తం ఫౌండేషన్ అభ్యుదయ రైతులకు పురస్కారాలను ప్రకటించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వడ్లమూడిలో శనివారం నిర్వహించిన సమావేశంలో పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెం, రఘునాథపాలెం మండలం కోయచెలకకు చెందిన సేంద్రియ రైతులు అనుమోలు రామిరెడ్డి, చెరుకూరి రామారావుకు పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మంత్రి అచ్చెంనాయుడు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు రోహిత్‌శర్మ



వంగివరపు రోహిత్‌శర్మ

కామేపల్లి: ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన వంగివరపు రోహిత్ శర్మ నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్టులో స్థానం దక్కించుకున్నాడు. టెన్నిస్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని మధురలో నిర్వహించిన పోటీల్లో రోహిత్‌శర్మ ప్రతిభ కనబర్చగా జట్టుకు ఎంపిక చేశారు. గ్రామీణ ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రోహిత్‌ను కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్‌తో పాటు నాయకులు అంబడిపూడి వెంకటేశ్వరరావు, ధనియాకుల మాధవరావు, బానోత్ నరసింహనాయక్, మేకల లక్ష్మీనారాయణ, శీలం పుల్లయ్య, పసుమర్తి సత్యనారయణ, వంగివరపు సీతారామాంజనేయశర్మ తదితరులు అభినందించారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్



పోటీల్లో పాల్గొన్న విజేతలతో నిర్వాహకులు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యాన జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పరీక్ష శనివారం నిర్వహించారు. ఖమ్మం శాంతినగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షను డీఈఓ సోమశేఖరశర్మ ప్రారంభించగా ఏఎంఓ రవికుమార్, డీసీఈబీ కార్యదర్శి నారాయణ, పాఠశాల హెచ్ఎం సీహెచ్.కృష్ణకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఇంగ్లిష్ మీడియంలో సాంఘిక శాస్త్రం బోధనను బలోపేతం చేయాలని కోరారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. సత్తుపల్లిలోని ఎన్టీఆర్ నగర్ జెడ్పీహెచ్ఎస్ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయిని కోట ఇందిర నగదు బహుమతులు అందజేయగా ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లగాని కృపా బాలానందం, వడ్డే చంద్రశేఖర్‌తో పాటు టి.సుబ్బారావు, పి.భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

మున్సిపాలిటీలపై ఆర్పీల వేతన భారం



- ఏడు నెలల జీతాలు చెల్లించాలని సీడీఎంఏ ఆదేశం
- ఆ తర్వాత రీయింబర్స్‌మెంట్ పద్ధతిలో చెల్లిస్తామని వెల్లడి
- నిధుల లేమితో ఇబ్బంది పడుతున్న పురపాలికలకు ఇక్కట్లే

ఖమ్మంమయూరిసెంటర్: ఓ పక్క అరకొరగా వస్తున్న ఆదాయం.. మరోపక్క నిండుకున్న ఖజానాతో కొట్టుమిట్టాడుతున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌పై అదనపు భారం పడుతోంది. మెప్మాలో ఆర్పీలుగా విధులు నిర్వర్తిస్తున్న వారి వేతనాలు చెల్లించాలని, తిరిగి రీయింబర్స్‌మెంట్ పద్ధతిన మున్సిపాలిటీలకు నిధులు ఇస్తామని సీడీఎంఏ ద్వారా మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లకు ఆదేశాలు అందాయి. సొంత సిబ్బందికే వేతనాలు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న మున్సిపాలిటీలపై కొత్త భారం వేయడంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లాలోని ఆర్పీలందరికీ వేతన బకాయిలు చెల్లింపునకు రూ.కోటి మేర నిధులు సరిపోతాయని, ఈ నిధులు కూడా లేవన్నట్లుగా చెల్లింపునకు మున్సిపాలిటీలను ఆదేశించడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సగం చెల్లించేందుకే మొగ్గు..

మున్సిపాలిటీల్లో జనరల్ ఫండ్ నిధులు తక్కువగా ఉండడంతో ఆర్పీల వేతనాలు చెల్లింపు విషయంలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఆర్పీలకు వేతన బకాయిలు మొత్తం చెల్లిస్తే మున్సిపాలిటీల్లో రోజువారీ పారిశుద్ధ్య పనులు, ఇతర అవసరాలకు ఇక్కట్లు ఎదురవుతాయనే ఆందోళనలో ఉన్నారు. సీడీఎంఏ ఆదేశాలతో వేతనాలు చెల్లించేందుకు సిద్ధమైనా ఖజానా చూసి ఏం చేయాలనే ఆలోచనలో పడ్డారు. ఈనేపథ్యాన మూడు నుంచి నాలుగు నెలల వేతనాలు ప్రస్తుతం చెల్లిస్తామనే ప్రతిపాదనను మెప్మా అధికారుల ఎదుట పెట్టినట్లు తెలిసింది. ఇదే సమయంలో ఒకటి, రెండు మున్సిపాలిటీలు మాత్రం మొత్తం వేతన బకాయిలు చెల్లించేందుకు సిద్ధమైనట్ల సమాచారం.

ఏడు నెలల బకాయిలు..

జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీల్లో ఆర్పీలు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి మెప్మా ద్వారా నెలకు రూ.6వేల గౌరవ వేతనం చెల్లిస్తుంటారు. అయితే ఏడు నెలలుగా వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండడంతో బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించాలని ఆర్పీల నుండి ఒత్తిడి పెరుగుతుండడంతో అధికారులు దృష్టి సారించారు. చివరకు సీడీఎంఏ, మెప్మా ఎండీ మున్సిపాలిటీల నుండి వేతనాలు చెల్లించేలా సూచనలు చేశారు.

బకాయిలు ఇలా...

కార్పొరేషన్/ మున్సిపాలిటీ	ఆర్పీలు	నెలనెలా వేతనం (రూ.లక్షల్లో)	మొత్తం బకాయిలు (రూ.లక్షల్లో)
ఖమ్మం	164	9.84	68.88
సత్తుపల్లి	24	1.44	10.08
వైరా	24	1.44	10.08
మధిర	29	1.74	12.18
మొత్తం	241	14.46	1,01,22,000

ఈ అంశంపై మెప్మా అధికారులను వివరణ కోరగా.. ఆర్పీలకు ఏడు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. అయితే, కేఎంసీ పరిధిలో నాలుగు నెలల బకాయిల చెల్లింపునకు నిధులు ఇస్తామన్నారని వెల్లడించారు. మిగిలిన మున్సిపాలిటీల్లోనూ నిధులు సమకూరుస్తామని కమిషనర్లు చెప్పారని తెలిపారు.

రోడ్డు భద్రతా చర్యలపై కార్యాచరణ

వీసీలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ఖమ్మంసహకారనగర్: ప్రమాదాలను అరికట్టేందుకు రోడ్డు భద్రతా చర్యలపై ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీసీ ద్వారా శనివారం కలెక్టర్లతో సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లాలో తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ వివరించారు. పాఠశాలల సమీపాన రహదారులను గుర్తించి విద్యార్థులు రోడ్డు దాటే సమయాన తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించేలా ఉపాధ్యాయులకు సూచనలు చేశామన్నారు. అలాగే, ఆటో డ్రైవర్లకు హెల్త్ క్యాంప్ నిర్వహించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించామని చెప్పారు. నూతన నిర్మాణాలకు పార్కింగ్ లేకుండా అనుమతి ఇవ్వడం లేదని, షాపింగ్ మాల్స్‌లోనూ సెల్లార్లలో మాత్రమే మాత్రమే పార్కింగ్ చేసేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతీ శాఖను భాగస్వామ్యం చేస్తూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించాలని సూచించారు. ఆతర్వాత జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్లను అధికారులతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆవిష్కరించారు. అదనపు డీసీపీ నరేష్‌కుమార్, ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వెంకటరమణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఎన్‌హెచ్ ఈఈ యుగంధర్, ఆర్డీఓ జి.నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు తానేశ్వర్, కె.దివ్య, ఎ.సంపత్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా గురుకుల డిగ్రీ కళాశాలకు న్యాక్ గ్రేడ్



న్యాక్ సర్టిఫికెట్‌తో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ+ గ్రేడ్ లభించింది. ఈ విషయాన్ని శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీవాణి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 20, 21వ తేదీల్లో న్యాక్ బృందం సభ్యులు కళాశాలలో బోధన, ఇతర సదుపాయాలను పరిశీలించారని తెలిపారు. ఈమేరకు సంతృప్తి చెందిన వారు బీ+ సర్టిఫికెట్ జారీ చేశారని పేర్కొన్నారు. ఈసమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, కోఆర్డినేటర్లు కే.పీ.ఐశ్వర్య, కె.రజిని, కె.రజిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపాన మున్నేరు నుండి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. బ్రాహ్మణపల్లి నుండి బోనకల్ వైపు వస్తుండగా ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వృత్తి ల్యాబ్ టెక్నీషియన్... ప్రవృత్తి చోరీలు!

- అంతర్ జిల్లా దొంగ అరెస్ట్
- రూ.18లక్షల విలువైన సొత్తు స్వాధీనం




నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం ఏసీపీ రమణమూర్తి

ఖమ్మంక్రైం: ల్యాబ్ టెక్నీషియన్ పనిచేస్తున్న వ్యక్తి విలాసవంతమైన జీవితానికి అలవాటు పడడంతో ప్రవృత్తిగా చోరీలను ఎంచుకున్నాడు. ఈక్రమాన ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలతో పాటు హైదరాబాద్‌లో దొంగతనాలు చేసిన నిందితుడిని ఖమ్మం పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఖమ్మంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన భారీ చోరీపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేయగా వివరాలను ఖమ్మం ఏసీపీ రమణమూర్తి వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నల్లగుడి తండాకు చెందిన గుగులోత్ నవీన్ ల్యాబ్ టెక్నీషియన్ పనిచేస్తూ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డాడు. ఆయనకు వచ్చే వేతనం సరిపోకపోవడంతో 2016 నుండి చోరీలు మొదలుపెట్టాడు. ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో ఇప్పటికే కేసులు నమోదవగా, హన్మకొండలో గత డిసెంబర్ నెల చోరీకి చేసిన ఆయన అక్కడి పోలీసులకు చిక్కకుండా ఖమ్మం చేరుకున్నాడు. ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపాన ఇళ్లలో రెక్కీ చేస్తూ అక్కడి ఎస్ఆర్‌సీ టవర్స్‌లో పరిశీలించగా 4వ ఫ్లోర్‌లోని సింగరేణి ఉద్యోగికి చెందిన ప్లాట్ తాళం వేసినట్లు గుర్తించాడు. ఆ అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మెన్ కూడా లేకపోవడంతో గతనెల 20న అర్ధరాత్రి వేళ చొరబడి బీరువాలో భద్రపరిచిన బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. యజమాని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఖమ్మం టూటౌన్, సీసీఎస్ పోలీసులు సీసీ ఫుటేజీల దర్యాప్తు చేపడుతూ నిందితుడు నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆయన నుంచి రూ.18లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ఈ సమావేశంలో సీసీఎస్ ఏసీపీ సర్వర్, సీఐ బాలకృష్ణ, ఉద్యోగులు గజేంద్ర, మంగీలాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల దొంగలు అరెస్ట్

గార్ల: వ్యవసాయ మోటార్లు చోరీ చేస్తున్న ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసి ఐదు మోటార్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ జిల్లా గార్లబయ్యారం సీఐ బి.రవికుమార్, ఎస్సై ఎస్.కే.రియాజ్‌పాషా తెలిపారు. ఈమేరకు శనివారం గార్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాదారానికి చెందిన ఈసం రాంబాబు, సీమల వెంకటేశ్వర్లు, ఈసం చుక్కయ్య ముఠాగా ఏర్పడి రాత్రి సమయాల్లో వ్యయసాయ మోటార్లు ఎత్తుకెళ్తున్నారు. ఈక్రమాన శనివారం గార్ల మండలంలోని సేరిపురం సమీపాన ఐదు మోటార్లను ఎత్తుకెళ్తూ పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించడంతో కారేపల్లి, డోర్నకల్, బయ్యారం మండలాల్లోనూ మోటార్లు చోరీ చేసినట్లు తేలిందని, ఇటీవల 18 రోజులు జైలుకెళ్లి వచ్చినా తీరు మారలేదని సీఐ తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ బలోపేతానికి కృషిచేయాలి



నియామక పత్రాలు అందుకున్న సభ్యులతో ఎంపీ రఘురాంరెడ్డి

టెలిఫోన్ అడ్వైజరీ బోర్డ్ కమిటీ సభ్యులతో ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్/మధిర/వైరా/కల్లూరు రూరల్/బోనకల్: గ్రామీణ స్థాయిలో బీఎస్ఎన్ఎల్ విస్తరణ, సంస్థ బలోపేతానికి కృషిచేయాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సూచించారు. ఆయన సిఫారసుతో ఖమ్మం, నల్లగొండ జిల్లాల టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యులుగా పలువురిని నియమిస్తూ కేంద్ర టెలీ కమ్యూనికేషన్ శాఖ నుండి శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ మేరకు సభ్యులుగా నియమితులైన అమరవాది సత్యనారాయణరెడ్డి(నిదానపురం), మచ్చా రామారావు(వైరా), ఉమ్మినేని కృష్ణ(గోవిందాపురం–ఎల్), యాస వెంకటేశ్వరరావు(చిన్నకోరుకొండి)తో పాటు షేక్ ఇమామ్ సాహెబ్, యాస వెంకటేశ్వరరావు, పిల్లెల రామ లక్ష్మయ్య, బోదాసు కనకరాజు, బానోత్ రంజిత్‌కు ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశాక ఎంపీ మాట్లాడారు. కేంద్ర కమ్యూనికేషన్స్, ఐటీ స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్న తాను రీజియన్ పరిధిలో బీఎస్ఎన్ఎల్ విస్తరణకు సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, నాయకులు మట్టా రాంబాబు, బెల్లం శ్రీనివాస్, గోసు మధు, దొడ్డా నగేష్, చంద్రశేఖర్, రాధాకృష్ణ, ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరమే..

- కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి
- కేయూ జోన్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం సాధించాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కె.ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కాకతీయ యూనివర్సిటీ పరిధి క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యలో ఏ స్థాయిలో రాణిస్తున్నట్లుగానే క్రీడల్లోనూ తర్ఫీదు పొందితే భవిష్యత్‌లో మేలు జరుగుతుందని చెప్పారు. విద్య, క్రీడల కలయికతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవడమే కాక సమాజంలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ క్రీడా పోటీల ద్వారా ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తిస్తున్నామని చెప్పారు. కేయూ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ప్రొఫెసర్ వై.వెంకయ్య మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో ప్రతీ జిల్లాకు ఇంటర్ జోనల్, ఇంటర్ యూనివర్సిటీ పోటీలను కేటాయించి విజయవంతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి, క్రికెట్ పోటీల కోఆర్డినేటర్ డాక్టర్ బి.వెంకన్న, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణారావు, యూసీపీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్‌తో పాటు టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జె.ఉపేందర్, అధ్యాపకులు కమల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టోర్నీలో ఖమ్మం జోన్ గెలుపు

కాకతీయ యూనివర్సిటీ పరిధి క్రికెట్ పోటీల్లో భాగంగా శనివారం ఖమ్మం – ఆదిలాబాద్ జట్ల మధ్య మాచ్‌లో జరగగా ఖమ్మం జోన్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ జట్టు 30 ఓవర్లలో 27 ఓవర్లు ఆడి 99 పరుగులకే ఆల్ ఔట్ అయింది. ఈ జట్టులో వినయ్ 33, హుజుర్ 22 పరుగులు చేశారు. ఇక ఖమ్మం జట్టు బౌలర్లలో శశి కుమార్ సునీల్, నీహిత్ రెండేసి వికెట్లు తీసుకున్నారు. ఆ తర్వాత 100 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఖమ్మం జోన్ జట్టు కేవలం 14 ఓవర్లలో విజయం సాధించింది. జట్టులో అజార్ 26, సచిన్ 20, సందీప్ 12 పరుగులు చేశారు. ఆదిలాబాద్ బౌలర్లలో రోహిత్ నాలుగు, హర్షవర్ధన్ రెండు వికెట్లు పడగొట్టారు.

గ్రంథాలయాల్లో పరిశీలించిన కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని గాంధీ పార్క్, పాత మున్సిపల్ కార్యాలయాల్లో కొనసాగుతున్న గ్రంథాలయాలను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య శనివా రం సందర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడి పుస్తకాల లభ్యత, వసతులు, సమస్యలపై ఆరా తీశారు. సరిపడా టేబుళ్లు, కుర్చీలు, ఫ్యాన్లు, లైట్లు లేకపోతే సమకూరుస్తామని తెలిపారు. ఈమేరకు పత్రికలు చదివేందుకు వచ్చేవారికి ప్రత్యేక గది ఏర్పాటుచేయాలని, గాంధీపార్క్‌లో టాయిలెట్లు నిర్మించాలని పలువురు కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం మమత రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ వేణుగోపాలాచారి తెలిపారు. పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, మీటర్ల మార్పు, నూతన సర్వీసుల మంజూరు, బిల్లుల్లో హెచ్చుతగ్గులు తదితర సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఫిర్యాదులు అందించొచ్చని వెల్లడించారు. సోమవారం ఉదయం 10–30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే సదస్సును ఖమ్మం టౌన్–2 పరిధి వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

ఖమ్మంక్రైం: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఒకరికి జైలు శిక్ష, నలుగురికి జరిమానా విధిస్తూ ఖమ్మం స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి(స్పెషల్ మొబైల్‌కోర్టు) బి.నాగలక్ష్మి తీర్పు వెలువరించారు. ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురిని శనివారం కోర్టులో హాజరుపరిచారు. గొల్లగూడెంకు చెందిన లారీడ్రైవర్‌కు మూడురోజులు జైలుశిక్ష విధించగా, ఇంకో నలుగురికి జరిమానా విధించారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కల్లూరు: మండలంలోని తూర్పులోకవరం శివార్లలో శనివారం సాయంత్రం కొందరు పేకాట ఆడుతుండగా ఎస్ఐ హరిత సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఐదుగురు పట్టుబడగా, ఓ వ్యక్తి పరారయ్యాడు. పట్టుబడిన వారి నుంచి రూ.20,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మామ హత్య కేసులో కోడలు...

కారేపల్లి: బయట తిరుగుళ్లు తగ్గించుకోవాలని సూచించిన మామపై వేడి నూనె పోసి ఆయన మరణానికి కారణమైన మహిళను పోలీసుల అరెస్ట్ చేశారు. మండలంలోని పైల్‌తండాకు చెందిన అజ్మీరా బాబు(60) కుమారుడు మృతి చెందగా సురేష్ భార్య ఉమ కుటుంబ సభ్యులతో జీవిస్తుంది. ఆమె తరచుగా బయటకు వెళ్తుండడంతో మందలించిన మామ బాబుపై డిసెంబర్ 28న వేడి నూనె పోసింది. ఆయన చికిత్స పొందుతూ ఈనెల 1న మృతి చెందగా కారేపల్లి పోలీసులు ఉమను శనివారం అరెస్ట్ చేసి ఖమ్మం కోర్టులో హాజరుపరిచారు.

అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య

కారేపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని ఈట్యాతండాకు చెందిన జాటోతు రాణి(35) తలలో క్రితం కణితి ఏర్పడగా రూ.4లక్షలు వెచ్చించి చికిత్స చేయించినా తగ్గడంలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఈనెల 2న పురుగుల మందు తాగడంతో కుటుంబీకులు కొత్తగూడెంలో చికిత్స చేయించాక శనివారం ఖమ్మం తరలిస్తుండగా మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారాం తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు...

చింతకాని: మండలంలోని మత్కేపల్లికి చెందిన పగడాల మహేష్(24) శుక్రవారం అర్ధరాత్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఏ పనీ చేయకుండా తిరుగుతుండడంతో తండ్రి మందలించగా మనస్తాపానికి గురైన మహేష్ అందరూ నిద్రించాక ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డుప్రమాదంలో జిల్లా వాసి మృతి

మిర్యాలగూడ టౌన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఖమ్మం వాసి మృతి చెందాడు. ఖమ్మం రాపర్తినగర్‌కు చెందిన సట్టు వెంకటేశ్వర్లు(35)తో పాటు మరికొందరితో కలిసి మిర్యాలగూడ మండలం బి.అన్నారంలో బంధువు దహనసంస్కారాలకు హాజరై నిమ్మల నవీన్ ఆటోలో మిర్యాలగూడ బయలుదేరారు. వెంకటాద్రిపాలెం శివారులో దమ్ము చక్రాలతో ఎదురువచ్చిన ట్రాక్టర్ వీరి ఆటోను ఢీకొట్టింది. ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని పోలీసులు తెలిపారు.

బాబే సుప్రీం.. రెడ్‌బుక్కే రాజ్యాంగం!

ఏపీలో బరితెగించి వ్యవహరిస్తున్న సీఐడీ

న్యాయస్థానమంటే ఖాతరు లేదు.. సీఆర్‌పీసీ 164 అంటే లెక్కే లేదు

సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా కుతంత్రం

ఐఏఎస్ అధికారులతో తప్పుడు వాంగ్మూలాల నమోదుకు పన్నాగం

మొదటి వాంగ్మూలానికి విరుద్ధంగా ఉండకూడదు

సీఆర్‌పీసీ 164 కింద ఓసారి న్యాయస్థానంలో నమోదు చేసిన వాంగ్మూలం అత్యంత విశ్వసనీయమైనదిగా పరిగణిస్తాం. ఎందుకంటే న్యాయమూర్తి ఎదుట ప్రమాణ పూర్వకంగా నమోదు చేసిన వాంగ్మూలమది. ఆ వాంగ్మూలాన్ని మార్చేందుకు వీల్లేదు. గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా వాంగ్మూలం ఇచ్చేందుకు సాక్షులు ప్రయత్నిస్తే వారిని సంబంధిత న్యాయస్థానం ప్రశ్నించాలి. మొదట ఇచ్చిన వాంగ్మూలాన్నే సాక్ష్యంగా పరిగణలోకి తీసుకోవాలి.

– 2024 నవంబరు 25న ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు. ఈ మేరకు ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ కేసులో జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం విస్పష్టమైన తీర్పునిచ్చింది.

విరుద్ధంగా ఇస్తే కఠిన చర్యలు

ఓసారి సీఆర్‌పీసీ 164 కింద ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరోసారి వాంగ్మూలం ఇస్తే అది నేరంగా పరిగణిస్తాం. ఎందుకంటే ప్రమాణ పూర్వకంగా ఇచ్చిన వాంగ్మూలాన్ని న్యాయమూర్తి చదవి వినిపించిన తర్వాత సమ్మతించి, మరీ సంతకం చేసి ఇచ్చిన వాంగ్మూలమది. మొదటిసారి ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరో వాంగ్మూలం ఇవ్వడమంటే.. మొదట ఇచ్చింది తప్పుడు వాంగ్మూలమని అంగీకరించినట్టే. అత్యంత విశ్వసనీయమైన న్యాయస్థానంలో న్యాయమూర్తి ఎదుట ప్రమాణం చేసి మరీ తప్పుడు వాంగ్మూలం ఇచ్చినట్టు అవుతుంది. అంటే అబద్ధపు వాంగ్మూలం ఇచ్చినందుకు నేరంగా పరిగణిస్తాం. ఆ విధంగా అబద్ధపు వాంగ్మూలం ఇచ్చిన వారిపై ఐపీసీ 193, సీఆర్‌పీసీ 340 కింద కఠిన చర్యలు తీసుకుంటాం.

– వినోద కుమారి వర్సస్ మధ్యప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు

ఎదుర్కోవాల్సిన పరిణామాలను న్యాయమూర్తి వివరించాలి

సీఆర్‌పీసీ 164 కింద ఓసారి ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరో వాంగ్మూలం ఇచ్చేందుకు సాక్షి ప్రయత్నిస్తే.. దాని వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులు, ఎదుర్కోవాల్సి వచ్చే పరిణామాల గురించి న్యాయమూర్తి ఆ సాక్షికి వివరించాలి.

– అలహాబాద్ హైకోర్టు తీర్పు

సాక్షి, అమరావతి: భారత రాజ్యాంగమే ప్రామాణికం.. సుప్రీంకోర్టు తీర్పులే మార్గ నిర్దేశం.. అన్నది దేశంలో పరిపాలన వ్యవస్థకు దిక్సూచి. పాలకులు, అఖిల భారత సర్వీసు అధికారులతోపాటు అందరూ పాటించాల్సిన విధివిధానాలవి. కానీ రాష్ట్ర సీఐడీ విభాగం అందుకు పూర్తి విరుద్ధంగా బరితెగిస్తోంది. 'చంద్రబాబే మాకు సుప్రీం.. టీడీపీ రెడ్‌బుక్కే మాకు రాజ్యాంగం.. చంద్రబాబు అవినీతి కేసులు నీరుగార్చడమే ఏకైక లక్ష్యం' అని చెలరేగిపోతోంది. అందుకోసం ఏకంగా న్యాయస్థానాల్లో సీఆర్‌పీసీ 164 కింద నమోదు చేసిన వాంగ్మూలం పవిత్రత, ప్రమాణికతనే దెబ్బ తీసేలా కుట్రలకు పదును పెడుతోంది. ఓసారి సీఆర్‌పీసీ 164 కింద ఇచ్చిన వాంగ్మూలాన్ని మార్చేందుకు వీల్లేదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను బరితెగించి మరీ ఉల్లంఘిస్తోంది. చంద్రబాబు సూత్రధారి, పాత్రధారిగా సాగిన కుంభకోణాల గురించి గతంలో పలువురు ఐఏఎస్ అధికారులు న్యాయస్థానంలో ఇచ్చిన వాంగ్మూలాలకు భిన్నంగా తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేయించేందుకు సీఐడీ సన్నాహాలు వేగవంతం చేస్తోంది. డీజీపీ పోస్టు ఇస్తానని ముఖ్య నేత ఎర వేయగానే సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా తోసిరాజంటూ సీఐడీ ఉన్నతాధికారి చెలరేగిపోతుండటం విస్మయ పరుస్తోంది. ఈ వ్యవహారం యావత్ దేశాన్ని విస్మయానికి గురి చేస్తోంది.

కుంభకోణాల కుట్రదారు చంద్రబాబే

2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. రాజధాని అమరావతిలో అసైన్డ్ భూముల కుంభకోణం, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాల కుంభకోణం, ఫైబర్‌నెట్ కుంభకోణం, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కుంభకోణం, మద్యం కుంభకోణం, ఇసుక కుంభకోణం.. ఇలా వివిధ కుంభకోణాలతో వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. వాటిపై సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కేసు నమోదు చేసి పూర్తి ఆధారాలతోసహా ఆ భారీ దోపిడీని బట్టబయలు చేసింది. ఆ వ్యవహారాల్లో కీలక పాత్రధారులుగా ఉన్న ఐఏఎస్ అధికారులను విచారించింది. నిబంధనలకు విరుద్ధమని తాము అభ్యంతరం



తెలిపినప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోలేదని వారు చెప్పారు. చంద్రబాబు ఒత్తిడితోనే నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల బదలాయింపు, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు, కాంట్రాక్టుల కేటాయింపు, నిధుల విడుదల.. ఇలా అన్ని వ్యవహారాలు సాగాయని వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వంలో సీఆర్‌డీఏ కమిషనర్‌గా వ్యవహరించిన చెరుకూరి శ్రీధర్, ఫైబర్‌నెట్ ఎండీగా వ్యవహరించిన అజయ్ జైన్, గుంటూరు కలెక్టర్‌గా చేసిన కాంతిలాల్ దండే తదితరులు ఆ వాస్తవాలను 'సిట్'కు తెలిపారు. అంతే కాకుండా ఆ విషయాలను న్యాయస్థానంలోనూ వెల్లడించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఆర్‌పీసీ 164 కింద వారు ఇచ్చిన వాంగ్మూలాలను న్యాయస్థానం నమోదు చేసింది. అందుకే ఆ కేసుల్లో చంద్రబాబును ప్రధాన నిందితుడు(ఏ1)గా పేర్కొంటూ సిట్ కేసులు నమోదు చేసింది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్ట్ చేయగా, ఆయన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 52 రోజులు రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే.

తప్పుడు వాంగ్మూలాల నమోదుకు ప్రభుత్వ కుట్ర

గత ఏడాది రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం చంద్రబాబు అవినీతి కేసులను నీరుగార్చేందుకు కుట్రకు తెరతీసింది. అందుకోసం డీజీపీ, సీఐడీ అధికారులు ఆ కేసుల దర్యాప్తు వివరాలను చంద్రబాబుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అంటే ప్రధాన నిందితుడే ఆ కేసులను సమీక్షించారు. ఆ కేసులను ఎలా నీరుగార్చాలనే కుట్రకు అప్పుడే బీజం పడింది. అనంతరం చంద్రబాబు తరఫున గతంలో వాదించిన ఢిల్లీ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా రంగ ప్రవేశం చేశారు. డీజీపీ, సీఐడీ అధికారులతో సమావేశమై చంద్రబాబుపై కేసులను నీరుగార్చే కుట్రకు కార్యాచరణ రూపొందించారు. గతంలో చంద్రబాబే కుట్రదారు.. కుంభకోణాలకు ఆయనే సూత్రధారి.. అని న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన వారితో తాజాగా తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించాలని పన్నాగం పన్నారు. ఆ బాధ్యతను సీఐడీకి అప్పగించారు. గతంలో సిట్‌లో సభ్యులుగా ఉన్న కింది స్థాయి అధికారులను డీజీపీ, సీఐడీ చీఫ్ పిలిపించుకుని మరీ తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేసే ప్రక్రియను వివరించారు. బాధిత రైతులు, సాధారణ సాక్షులను కింది స్థాయి అధికారులు బెదిరిస్తుండగా, ఐఏఎస్ అధికారులతో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించే బాధ్యతను సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ భుజానికెత్తుకున్నారు.

బెదిరించి.. భయపెట్టి..

కుట్రలో భాగంగా ఐఏఎస్ అధికారులు చెరుకూరి శ్రీధర్, అజయ్ జైన్‌లతో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించేందుకు సీఐడీ బరితెగించింది. గతంలో న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ కింద తాము ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా వాంగ్మూలం ఇవ్వాలని వారిపై సీఐడి తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చింది. బెదిరింపులకు పాల్పడింది. తప్పుడు వాంగ్మూలం ఇవ్వకపోతే సంగతి తేలుస్తామని హెచ్చరించింది. గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా తప్పుడు వాంగ్మూలం ఇవ్వడం సాధ్యం కాదని, అది నేరమని కూడా ఆ అధికారులు, న్యాయ నిపుణులు చెప్పినా సరే సీఐడీ చీఫ్ రవి శంకర్ అయ్యన్నార్ ఏమాత్రం వినిపించుకోలేదని సమాచారం. ఇలా సీఐడీ సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించి చెరుకూరి శ్రీధర్, అజయ్ జైన్‌లను బెంబేలెత్తించారు. దాంతో వారు తప్పుడు వాంగ్మూలాలు ఇచ్చేందుకు సమ్మతించినట్టుగా సీఐడీ వర్గాలు చెబుతున్నాయి. వారిద్దరితో గుంటూరులోని న్యాయస్థానంలో శుక్రవారం తప్పుడు వాంగ్మూలం నమోదు చేయించేందుకు సీఐడీ అధికారులు తీసుకువచ్చేందుకు సిద్ధపడ్డారు. అయితే న్యాయాధికారి సెలవులో ఉండటంతో ఆ ప్రయత్నాన్ని శనివారానికి వాయిదా వేశారు. తీరా శనివారం చెరుకూరి శ్రీధర్ ఒక్కరినే తీసుకెళ్లారు. కోర్టు బయట కొద్ది సేపు హైడ్రామా నడిచింది. ఆ తర్వాత కోర్టు హాలు లోపలికి వెళ్లకుండానే శ్రీధర్ వెనుదిరిగారు. మళ్లీ ఈ నెల 8వ తేదీన ఆయన్ను న్యాయస్థానానికి తీసుకొచ్చి వాంగ్మూలం నమోదు చేయించాలని సీఐడీ నిర్ణయించినట్లు తెలిసింది.

ఏడేళ్ల వరకూ జైలు శిక్ష

న్యాయస్థానాల్లో కేసుల విచారణ ప్రక్రియలో ఏ సందర్భంలో అయినా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వడం తీవ్రమైన నేరం అని సెక్షన్ 229 (1) స్పష్టం చేస్తోంది. అటువంటి అబద్ధపు వాంగ్మూలం ఇచ్చిన వ్యక్తికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించేందుకు అవకాశం కల్పిస్తోంది. అంటే సీఆర్‌పీసీ 164 కింద న్యాయమూర్తి ఎదుట ప్రమాణ పూర్వకంగా రెండు విరుద్ధ వాంగ్మూలాలు ఇస్తే అందులో ఒకటి అబద్ధపు వాంగ్మూలమే అవుతుంది. మొదటి వాంగ్మూలం గానీ రెండో వాంగ్మూలం గానీ ఏది అబద్ధపు వాంగ్మూలం అయినా శిక్షార్హమే. దాన్ని నేరంగా పరిగణించి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు.

మరీ ఇంత ద్రోహమా? ఇంత బరితెగింపా?

- కూటమి సర్కార్ తీరుపై వైఎస్ జగన్ మండిపాటు
- తల్లికి వందనం, రైతు భరోసా ఎక్కడ చంద్రబాబూ?
- ప్రజలను నమ్మించి.. అధికారంలోకి వచ్చాక వంచనా?
- పిల్లలు, తల్లులు, రైతులు, యువత, వలంటీర్లు.. అందరినీ మోసం చేశారు



సాక్షి, అమరావతి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో అలసత్వం, నిర్లక్ష్యం, ఎగవేత ధోరణి ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాజాగా తల్లికి వందనం ఎగవేతపై కూటమి సర్కార్‌ను నిలదీశారు. లక్షలాది మంది తల్లులు, పిల్లలు.. అన్నదాతలంటే మీకు అలుసా.. అని ప్రశ్నించారు. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయడం, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కడం మీకు అలవాటుగా మారిపోయిందని నిప్పులు చెరిగారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విటర్) ఖాతాలో పోస్ట్ చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

- ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై ఇంతటి బరితెగింపా? మేనిఫెస్టోపై ఇంతటి తేలిక తనమా? ప్రజలకు ఇచ్చిన మాటను అమలు చేయకుండా టేక్ ఇట్ గ్రాంటెడ్‌గా తీసుకుంటారా? లక్షల మంది తల్లులకు, పిల్లలకు, రైతులకు ఇంతటి ద్రోహం తలపెడతారా?
- అధికారంలోకి వస్తే తల్లికి వందనం అని, ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. అధికారంలోకి రాగానే అంతకు ముందు మేం ఇస్తున్న అమ్మ ఒడి పథకాన్ని సైతం ఆపేశారు. వరుసగా కేబినెట్ సమావేశాలు జరుగుతున్నాయి కానీ, తల్లికి వందనం పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారో నిర్దిష్టంగా చెప్పలేదు. తీరా ఈ ఏడాదికి ఇవ్వం అని కేబినెట్లో తేల్చి చెప్పేశారు. ఇంత కన్నా మోసం ఏమైనా ఉంటుందా? ఇంతకన్నా పచ్చి దగా ఏమైనా ఉంటుందా?
- ఇక రైతు భరోసా తీరు కూడా అలానే ఉంది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ రెండు సీజన్లు అయిపోతున్నా ఇవ్వకుండా గడిపేశారు. మేము అధికారంలోకి వచ్చిన ఆ ఏడాదే.. అంటే 2019 అక్టోబర్‌లో ప్రారంభించి నప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం రూ.13,500 చొప్పున 53.58 లక్షల మంది రైతుల చేతిలో, రూ.34,378 కోట్లు పెట్టాం. కేంద్రం ఇచ్చేది కాకుండా మీరు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు ఖరీఫ్ అయిపోయిందీ, రబీ కూడా అయిపోయింది. ఒక్క పైసా ఇవ్వలేదు. ఇది రైతులను నిలువెల్లా మోసం చేయడం కాదా? 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ రూ.18 వేలు ఇస్తామన్నదీ మోసమే. నిరుద్యోగ భృతి కింద యువతీ యువకులకు రూ.36 వేలు చొప్పున ఇస్తామన్నది కూడా మోసమే. 50 సంవత్సరాలు నిండిన ప్రతి అక్కకూ రూ.48 వేలు అయినా మోసమే. ఇంటింటికీ సేవలు అందిస్తూ మంచికి అర్థం చెప్పిన వలంటీర్లకూ మీరు చేసింది మోసమే. ఈ మోసాలు అన్నింటికీ తోడు, మీ పాలనలో ప్రజలపై ఛార్జీలతో బాదుడే బాదుడు కనిపిస్తోంది. ప్రతి అడుగులోనూ స్కామ్‌లే. ఇసుకను వదలడం లేదు, మద్యాన్నీ వదలడం లేదు.
- చంద్రబాబూ గారూ.. రోజులు గడుస్తున్న కొద్దీ, మీరు చేస్తున్న మోసాలు ఒక్కొక్కటీ బయటకు వస్తూనే ఉన్నాయి. ఇవి ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తున్నాయి. ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి, వారి గొంతుకై నిలుస్తోంది. ప్రజలకు మీరు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం వారి తరఫున నిలబడుతుంది.

శ్రీవారి సేవలో జాన్వీ కపూర్

బాలీవుడ్ సినీ తార జాన్వీకపూర్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమె శుక్రవారం రాత్రి కాలినకడన తిరుమల చేరుకుని శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. సినీ డైరెక్టర్ వీఎస్ ఆదిత్య కూడా తిరుమలేశుడిని దర్శించుకున్నారు.

– తిరుమల



జిల్లా వార్తలు

నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్



భట్టు అరుణ్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంకు చెందిన చెందిన భట్టు అరుణ్‌కుమార్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ పి.జాన్సన్, డాక్టర్ జీ.పీ.రాజు, పి.సుధాకర్ నేతృత్వాన ఆయన ఫుట్‌బాల్ క్రీడాకారుల శిక్షణపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంధానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈసందర్భంగా అరుణ్, ఆయన తల్లిదండ్రులు వీరభద్రం, శాంతిని పలువురు అభినందించారు.


లాల్‌సింగ్ తండా వాసికి..



జాన్‌వెస్లీ

కూసుమంచి: కూసుమంచి మండలం లాల్‌సింగ్‌తండాకు చెందిన భూక్యా జాన్ వెస్లీకి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ ప్రకటించారు. ప్రొఫెసర్లు సురేష్‌బాబు, సతీష్‌కుమార్ పర్యవేక్షణలో పరిశోధనా పత్రం సమర్పించిన ఆయన డాక్టరేట్ అందుకున్నారు. మారుమూల తండాకు చెందిన నిరుపేద కుటుంబంలో జన్మించిన జాన్‌వెస్లీ పట్టుదలతో చదివి డాక్టరేట్ సాధించడంతో పలువురు అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు రశీదు అందచేస్తున్న అధికారులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదానానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భక్తులు శనివారం విరాళం అందచేశారు. అనంతపురం జిల్లా గుత్తి గ్రామానికి చెందిన గొర్ల రమేష్ – మహేశ్వరి దంపతులు రూ.లక్ష చెక్కును అధికారులు అందచేశాక స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలు!

- దొడ్డిదారిన హక్కుల బదలాయింపు
- పీఓటీ చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనేతరుల పాగా
- స్థానిక గిరిజనులకు మాత్రం శూన్యహస్తం

దమ్మపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో పీఓటీ చట్టం, నిబంధనలు ఉల్లంఘించి అసైన్డ్ భూములను గిరిజనేతరులు పట్టాలు చేయించుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం పేదలకు అందజేసిన వ్యవసాయ భూములు అన్యాక్రాంతం కావొద్దనే భావనతో అసైన్‌మెంట్ భూముల బదలాయింపు నిషేధ చట్టం(పీఓటీ)ను 1977లో తీసుకొచ్చారు. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం నుంచి ఉచితంగా భూములు పొందిన వారు సాగు చేసుకోవాలే తప్ప కౌలుకు ఇవ్వడం, అమ్మడం, దానం చేయడంపై నిషేధముంటుంది. అయితే, స్వాతంత్ర సమరయోధులు, మాజీ సైనికులు, రాజకీయ బాధితులు అత్యవసర పరిస్థితుల్లో భూములను అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీఓ 1045ను 2004 డిసెంబర్‌లో తీసుకొచ్చింది. ఈ జీఓ ప్రకారం భూములు పొందిన పదేళ్ల అనంతరం కలెక్టర్ల ద్వారా ఎన్ఓసీ పొందితే అమ్ముకునే అవకాశం లభిస్తుంది. ఈ జీఓను సాకుగా చేసుకుని పలువురు అక్రమమార్గాల్లో పట్టాలు చేయించుకున్నారని తెలుస్తోంది.

300 ఎకరాలకు పైగా భూములు

దమ్మపేట మండలంలోని నల్లకుంట, జమేదారు బంజర, గుర్వాయిగూడెం, కొమ్ముగూడెం లింగాలపల్లి గ్రామాల్లో స్వాతంత్ర సమరయోధులు, మాజీ సైనికులు, రాజకీయ బాధితులకు 1970, 80 దశకాల్లో 273, 884, 1458 సర్వే నంబర్లలోని దాదాపు 300 ఎకరాల అసైన్డ్ భూమిని పంపిణీ చేశారు. ఆ సమయాన భూములు అడవుల మాదిరిగా ఉండడంతో వారెవరూ సాగు చేసిన దాఖలాలు లేవు. దీంతో స్థానిక గిరిజనులే సాగు చేస్తుండగా ఇప్పుడు భూములు పొందిన వారికి అమ్ముకునే హక్కు కూడా లేదని స్థానికులు చెబుతున్నారు.



దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం

కొనుగోళ్లు, పట్టాలు

మండలంలోని పలు గ్రామాల్లో దాదాపుగా గిరిజనులే తరతరాలుగా జీవిస్తున్నారు. కానీ ఈ గ్రామాలు ఏజెన్సీ పరిధిలో లేకున్నా అధిక శాతం గిరిజనులు ఉన్నప్పటికీ ఇక్కడి అసైన్డ్ భూముల నుంచి కారుచౌకగా కొనుగోలు చేసిన గిరిజనేతరులు దొడ్డిదారిన పట్టాలు చేయించుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. 1045 జీఓ ఆధారంగా యాజమాన్య హక్కు పత్రాలు పొందారని సమాచారం. కానీ భూములు పొందిన వారికి అమ్ముకునే హక్కు లేకున్నా జీఓ 1045 ఆధారంగా 1990 నుంచి 2020(ధరణి సైట్ ప్రారంభం) వరకు పలువురు గిరిజనేతరులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి పట్టాలు చేయించుకున్నారని సమాచారం. కాగా, ఆ భూములు స్వాతంత్ర సమరయోధులు, మాజీ సైనికులు, రాజకీయ బాధితుల స్వాధీనంలో లేకున్నా కొనుగోలు చేసి పట్టాలు తెచ్చుకోవడం గమనార్హం. అయితే, కొందరు ధరణి సైట్ అందుబాటులోకి వచ్చాక జీఓ 1045 ఆధారంగా అసైన్డ్ భూములను అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకోగా, మరికొందరు రెవెన్యూ ఉద్యోగుల ద్వారా పట్టాలు పొందినట్లు సమాచారం.

గిరిజనులకు అందని పట్టా పుస్తకాలు

గిరిజన ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేసిన గిరిజనేతరులు దొడ్డిదారిన యాజమాన్య హక్కులను పొంది ప్రభుత్వం ద్వారా రైతుబంధు సాయం అందుకుంటున్నారు. ఇదే సమయంలో అసలైన గిరిజన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేక ఏ సాయమూ అందడం లేదు. పలు సర్వే నంబర్లలో 2020వ సంవత్సరంలో చేపట్టిన ఎంజాయ్‌మెంట్ సర్వే ద్వారా వివరాలను రికార్డుల్లో పొందుపరిచినా సాగులో ఉన్న గిరిజన రైతులు చాలా మందికి పట్టాదారు పుస్తకాలు అందలేదు. ఇదేంటని ఆరాతీస్తే నిర్దేశిత సర్వే నంబర్లు, వాటి విస్తీర్ణానికి మించి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరయ్యాయని తెలుస్తోంది. కాగా, దమ్మపేట తహసీల్‌లో పనిచేస్తున్న ఓ అధికారి వ్యవసాయ బోరు వేయించుకునేందుకు అనుమతి కోరిన రైతు నుంచి డబ్బు డిమాండ్ చేసినట్లు ప్రచారం జరిగినా విచారణ చేపట్టలేదు. ఇటీవల రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సర్వేయర్‌కు సైతం సదరు అధికారి అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి అధికారుల సహకారంతో గిరిజనేతరులు పట్టాలు చేయించుకున్నట్లు సమాచారం.

విచారణ జరిపిస్తేనే ఫలితం



అసైన్డ్ భూములను అక్రమంగా కొనుగోలు చేసి పట్టాలు పొందిన గిరిజనేతరుల వ్యవహారంపై విచారణ జరిపించాలి. తద్వారా గిరిజన కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. అలాగే, గతంలో చేసిన సర్వే ఆధారంగా గిరిజనులకు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి.

– చాపా చలమరావు, లింగాలపల్లి

మా హయాంలో జరగలేదు



ఈ ప్రాంతంలో అసైన్డ్ భూములకు పట్టాదార్ పాస్‌పుస్తకాలను ఎవరికీ మా హయాంలో కేటాయించలేదు. ఈ అంశంపై మాకు ఫిర్యాదులు కూడా రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే సమగ్రంగా విచారణ జరిపించి చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదు.

– వాణి, డిప్యూటీ తహసీల్దార్

మోడీ చేసే మోసాలకు భారతరత్న ఇవ్వాలి

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కే.ఏ.పాల్

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలో నిరుద్యోగ సమస్య లేకుండా ఏటా కోటి ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధిపై ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి భారతరత్న అవార్డు ఇవ్వాలని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ కే.ఏ.పాల్ వ్యాఖ్యానించారు. ఖమ్మంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానపరిచేలా కేంద్ర మంత్రులు వ్యవహరిస్తుండడం



సమావేశంలో మాట్లాడుతున్న పాల్

మంచి పద్ధతి కాదన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విషయమై ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏటా రూ. లక్షన్నర కోట్ల అప్పు చేస్తూ ప్రజలపై భారం మోపుతోందని ఆయన ఆరోపించారు. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ముగ్గురు మంత్రులు చొరవ చూపాలని కోరారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ గెలుపొందిన చోట్ల వంద రోజుల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని పాల్ ప్రకటించారు.

- ఖమ్మం సహకారనగర్: సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో 20వేల మంది ఉద్యోగులతో మహాధర్నా నిర్వహిస్తామని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ కే.ఏ.పాల్ తెలిపారు. కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు.

హక్కులు, బాధ్యతలు రెండు కళ్లు



సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు

నేటి నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు

ఖమ్మంసహకారనగర్: అధ్యయనం, అభ్యాసనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా.. హక్కులు, బాధ్యతలు రెండు కళ్లుగా యూటీఎఫ్ ప్రయాణం కొనసాగుతోందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఏ.వెంకట్ తెలిపారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలు ఈనెల 5నుండి 8వ తేదీ వరకు కాకినాడలో జరగనున్నాయని వెల్లడించారు. ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం యూటీఎఫ్ ఆది నుంచి కృషి చేస్తోందని తెలిపారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మరొకసారి గెలిపించాలని వారు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కాగా, హైదరాబాద్, నల్లగొండ నుంచి వస్తున్న జాతాలు వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించగా యూటీఎఫ్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఖమ్మం జిల్లా జాతాతో కలిసి ముందుకు బయలుదేరగా సీనియర్ నాయకుడు జియావుద్దీన్ ప్రారంభించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, బి.వెంకన్న, షమీ, రాంబాబు, రాందాస్, ఉద్దండు, సురేష్, నాగేశ్వరరావు, సుధాకర్, నవీన్ కుమార్, అరవింద్, శ్రీనివాసరావు, గురవయ్య, శచేంద్రబాబు బి.నర్సింహారావు, రాజశేఖర్, వీరబాబు, కల్యాణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పురుషుల జట్టుతో అసోసియేషన్ బాధ్యులు



సీనియర్ ఖో–ఖో జిల్లా జట్ల ఎంపిక

కల్లూరు: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఖో–ఖో పురుషులు, మహిళల జట్లను శనివారం ఎంపిక చేశారు. కల్లూరు మినీ స్టేడియంలో ఖో–ఖో అసోసియేషన్ ఆధ్వర్యాన ఎంపిక పోటీలు నిర్వహించగా 50 మంది చొప్పున పురుషులు, మహిళలు హాజరయ్యారు. వీరిలో నుంచి 18మంది చొప్పున క్రీడాకారులతో జట్లను ప్రకటించారు. ఆయా జట్లు ఈనెల 8నుంచి వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఖో–ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పత్తిపాటి నివేదిత, పీడీలు, అసోసియేషన్ బాధ్యులు వరకా రామారావు, భీమా, ఎస్.ప్రసాద్, సమ్మయ్య, సాంబశివారెడ్డి, పాపారావు, రమేష్, గుంటుపల్లి రమాదేవి, శ్వేత, పద్మ, త్రివేణి, విజయ, సునీత పాల్గొన్నారు. కాగా, క్రీడాకారులకు స్ఫూర్తి ఫౌండేషన్ తరఫున వుయ్యూరి శ్రీవ్యాల్ క్రీడాదుస్తులు అందజేశారు.



ఉమ్మడి జిల్లా ఖో–ఖో మహిళల జట్టు